సాక్షి తిరుపతి

మంగళవారం । 21 । నవంబర్ । 2023



న్యాయాన్ని చంపేస్తారా?

తన భార్య కాపురానికి రాలేదని, కానిస్టేబుల్ బెదిరించాడని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. - 8లో



చిన్నమర్యాద

ఉత్తరాది మఠం ప్రధాన పీఠాధిపతికి టీటీడీ అధికారులు చిన్నమర్యాద చేశారు. స్వావారి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. - 8లో



ప్రేమా..ఇది నీకు న్యాయమా!

తమ ప్రేమను పెద్దలు ఒప్పకోరేమోనన్న భయంతో ప్రేమికులు రైలుకింద పడి తనువు చాలించారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి



అర్జీదారులతో మాట్లాడుతున్న అధికారులు

తిరుపతి అర్బన్: స్పందనకు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని డీఆర్వో పెంచల కిషోర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మొత్తం 147 అర్జీలు వచ్చినట్టు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా 113 అర్జీలు రెవెన్యూశాఖకు చెందినవే ఉన్నాయన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే చేపడుతోందని, సర్వే పూర్తయిన తర్వాత రెవెన్యూ సమస్యలు నామమాత్రంగా మిగులుతాయని వెల్లడించారు. స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 79,800 మంది స్వామివారిని దర్శించుకోగా 25,962 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.55 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గానికి మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి విచ్చేయనున్నారు. ఈ మేరకు అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. సభా ప్రాంగణాన్ని చూడముచ్చటగా తీర్చిదిద్దారు. వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా పార్కింగ్ సౌకర్యం కల్పించారు. భద్రతా చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

- నేడు సూళ్లూరుపేట నియోజకవర్గానికి సీఎం జగన్
- పటిష్ట ఏర్పాట్లు చేపట్టిన అధికార యంత్రాంగం
- మత్స్యకారుల చిరకాల స్వప్నానికి సమయం ఆసన్నం



తడ మండలం, మాంబట్టు సెజ్ వద్ద సిద్ధమైన సభాప్రాంగణం

సూళ్లూరుపేట: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఆయన సూళ్లూరుపేట నియోజకవర్గంలో పలు ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేయనున్నారు. ఈ మేరకు అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. తడ మండలం, మాంబట్టు వద్ద హెలీప్యాడ్, అక్కడి నుంచి కిలోమీటరు దూరంలో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా పులికాట్ ముఖ్యద్వారాల పూడికతీత పనులకు ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేయనున్నారు. అలాగే కాళంగినదిపై నాలుగులేన్ల వంతెన నిర్మాణానికి, సూళ్లూరుపేట, తడ మండలాలకు ఉప్పునీటి బాధను తప్పించేందుకు కాళంగి గ్రాయిన్ నిర్మాణానికి శంఖు స్థాపన చేయనున్నారు. తర్వాత కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి మాంబట్టు సెజ్‌లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ట్రయల్ రన్ నిర్వహించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మరోవైపు జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు.

ముఖ్యమంత్రి జగన్ పర్యటన ఇలా..

- మంగళవారం ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి 9 గంటలకు విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు.
- 9.45 గంటలకు గన్నవరం నుంచి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 10.20 గంటలకు మాంబట్టు సెజ్‌కు..
- 10.30కు హెలీప్యాడ్ వద్ద ప్రత్యేక బస్సు ఎక్కి మాంబట్టు సెజ్ రోడ్డు మీదుగా సభాప్రాంగణానికి చేరుకుంటారు.
- 10.45 నుంచి 10.55 దాకా ఎగ్జిబిషన్, పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.
- 11.15 నుంచి 11.30 మత్స్యకారులతో ఇంటరాక్షన్
- 11.30 నుంచి 12.15 దాకా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు
- 12.15 నుంచి 12.25 దాకా ఓట్ ఆఫ్ థాంక్స్ చెబుతారు
- 12.30 గంటలకు సభాప్రాంగణం నుంచి బయలుదేరి 12.40 హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.40 నుంచి 1.40 దాకా స్థానిక నాయకులతో ఇంటరాక్షన్
- 1.45 గంటలకు మాంబట్టు సెజ్ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 2.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 2.15 గంటలకు రేణిగుంట నుంచి విమానంలో బయలుదేరి 3 గంటలకు విజయవాడలోని గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.

అఖండ కోటి దీపోత్సవం



కోటి దీపోత్సవంలో ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో రామారావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అఖండ కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని నటరాజ స్వామి సన్నిధి వద్ద పూలతో మహాశివలింగ ప్రతిమ, దీపారాధన అలంకరణ చేశారు. అలాగే ఆలయంలోని అద్దాల మండపం వద్ద దీప స్తంభం ఏర్పాటు చేసి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఆలయ వేదపండితులు ఆగమోక్తంగా కోటి సోమవారం క్రతువును నిర్వహించారు. చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో రామారావు దీపాలను వెలిగించారు. అనంతరం భక్తులు, ఆలయ అధికారులు కూడా దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



తిరుపతిలో కార్తీక దీపోత్సవ సందడి నెలకొంది. కార్తీకమాసంలో మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు ఆలయాలకు పోటెత్తారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. - తిరుపతి కల్చరల్

క్లుప్తంగా

హత్య కేసులో నలుగురికి జైలు

తిరుపతి లీగల్: హత్య కేసులో నలుగురికి శిక్ష విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాషా సోమవారం తీర్పు చెప్పారు. ఈస్టు సీఐ మహేశ్వర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ అయ్యప్ప తెలిపిన కేసులోని వివరాల మేరకు.. తిరుపతి ఎమ్మార్‌పల్లిలోని మజ్జిగకాలువకు చెందిన ఆర్.శరవణకుమార్ కూలీలను పెట్టుకుని టైల్స్ పరిచే వృత్తి నిర్వహించేవాడు. తన తమ్ముడు ఆర్.సతీష్ మద్యానికి బానిసై ఇంట్లో వారిని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వేధించేవాడు. 2019 ఫిబ్రవరిలో సతీష్ ఇంట్లోని తన తల్లి విజయను డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆమె ఇవ్వకపోవడంతో చేతిపై గాయాలు చేసి ఇంటి నుంచి పరారయ్యాడు. దీనిపై శరవణకుమార్ తన తమ్ముడు సతీష్‌పై కక్ష్య పెంచుకున్నాడు. 2019 ఫిబ్రవరి 23వ తేదీ మధ్యాహ్నం సతీష్ డీఆర్.మహల్ రోడ్డులోని గ్రీన్ పార్కు అపార్ట్‌మెంటు వద్ద ఉండగా శరవణకుమార్ అతని వద్ద పనిచేసే తిరుపతి పద్మావతీపురానికి చెందిన టి.హరి, తిరుపతి రూరల్ వేదాంతపురం పంచాయతీ, విజయనగర్ కాలనీకి చెందిన దూదేకుల రియాజ్ అలియాస్ పండు, తిరుపతిలోని ఎల్‌బీసీ రోడ్డుకు చెందిన పి.హేమకుమార్‌లు ఐరన్ రాడ్లతో అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో అపస్మారక స్థితికి చేరిన సతీష్‌ను చుట్టుపక్కల ప్రజలు రుయాకు తరలించారు. అతను అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై విజయ తన పెద్దకుమారుడు శరవణకుమార్‌తో పాటు మరో ముగ్గురిపై ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ శివప్రసాద్‌రెడ్డి కేసు దర్యాప్తు చేసి నలుగురి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నలుగురికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కీర్తి శేఖర్ వాదించారు.

న్యాయాన్ని ‘చంపేస్తారా’?

భార్యను కాపురానికి పంపాలంటూ పోలీసులను ఆశ్రయించాడో భర్త. ఎలాగైనా తనకు న్యాయం చేయాలని ప్రాధేయపడ్డాడు. కానీ ఆ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఆమెకు వత్తాసు పలుకాడు. ‘నీ భార్య నీతో రావడానికి ఇష్టపడడం లేదు’ అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భర్త ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన చంద్రగిరి పోలీస్ స్టేషన్ వద్ద కలకలం రేపింది.

- భార్య కాపురానికి రాలేదని భర్త మనస్తాపం
- పోలీసులను ఆశ్రయించినా ప్రయోజనం శూన్యం
- కానిస్టేబుల్ బెదిరించాడంటూ ఆత్మహత్యాయత్నం
- ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం
- చంద్రగిరి పోలీస్ స్టేషన్ వద్ద కలకలం



శరీరంపై నిప్పంటించుకుని పోలీసు స్టేషన్ వద్ద కేకలు వేస్తున్న బాధితుడు మణికంఠ

చంద్రగిరి: చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో సోమవారం దారుణ చోటుచేసుకుంది. ఓ వ్యక్తి పోలీసు స్టేషన్ వెలుపల ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తనను కానిస్టేబుల్ బెదిరించడంతోనే పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నానంటూ వాగ్మూలం ఇవ్వడం చర్చనీయాంశమైంది. బాధితుడి కథనం మేరకు.. కృష్ణాజిల్లా, విజయవాడ అర్బన్‌లోని పాయకాపురానికి చెందిన కాశీవిశ్వనాథ్ కుమారుడు భాస్కరాని మణికంఠ(32)కి, తమిళనాడులోని తిరుత్తణికి చెందిన దుర్గా భార్యాభర్తలు. వీరికి పాపా, బాబు ఉన్నారు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం భర్త మణికంఠతో గొడవపడి దుర్గా తిరుపతికి చేరింది. స్థానికంగా ఉన్న సోనుతో ఆమెకు పరిచయం ఏర్పడడంతో అదికాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. తర్వాత చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు వారికి భాకరాపేటలోని తన తోటలో ఆశ్రయం కల్పించారు. విషయం తెలుసుకున్న సోమవారం మణికంఠ చంద్రగిరికి చేరుకున్నాడు. తర్వాత చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు చేరుకుని, తన భార్యను కాపురానికి పంపాలంటూ పోలీసులను కోరాడు. ఈ క్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాసులు, మణికంఠకు ఫోన్ చేసి ‘నీ భార్య నీతో రావడానికి ఇష్టపడడం లేదు.. వదిలేసి వెళ్లిపో’ అంటూ బెదిరించినట్టు బాధితుడు వాపోయాడు. తన భార్యను తనతో పంపాలని మరోసారి కోరగా.. కానిస్టేబుల్ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో తీవ్ర మనస్తానికి గురైన మణికంఠ పోలీసు స్టేషన్ పక్కనే ఉన్న పెట్రోల్ బంకులోకి వెళ్లి మూడు లీటర్ల పెట్రోల్‌ను కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి కూతవేటు దూరం వెళ్లి శరీరంపై పెట్రోల్ పోసుకుని మంటలతోనే కేకలతో పెడుతూ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాడు. మంటల్లో కాలిపోతున్న మణికంఠను కాపాడేందుకు అక్కడే ఉన్న పాత్రికేయులు, పోలీసులు తీవ్రంగా శ్రమించారు. కానిస్టేబుల్ శ్రీనివాసులు తనను బెదిరించడంతోనే ఈ ఘాతకానికి పాల్పడ్డానని, తన భార్య తనకు కావాలంటూ బాధితుడు ఎస్‌ఐ హిమబిందును వేడుకున్నారు. అనంతరం క్షతగాత్రుడిని హుటాహుటిన తిరుపతి రుయాకు తరలించారు. మణికంఠను పరీక్షించిన వైద్యులు 72 శాతానికి పైగా శరీరం కాలిపోయిందని, పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మణికంఠ తన ఆత్మహత్యాయత్నానికి పోలీసుల తప్పు లేదని, వారే మంటలార్పారని తెలిపారు.

ఉత్తరాది మఠం పీఠాధిపతికి చిన్న మర్యాద

తిరుమల: ఉత్తరాది మఠం ప్రధాన పీఠాధిపతి జగద్గురు సత్యాత్మ తీర్థ స్వామీజీకి సోమవారం టీటీడీ శ్రీవారి ఆలయం తరపున చిన్నమర్యాద చేశారు. శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ అర్చకస్వాములు, టీటీడీ ఆలయ అధికారులు ఇస్తికఫాల్ స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. పీఠాధిపతితో పాటు ఈవో ధర్మారెడ్డి ఉన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

చిత్తూరు అర్బన్: నగరంలో గంగాసాగరంలో వెంకటేష్ అనే వ్యాపారి ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.9లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరించినట్లు బాధితుడు తెలిపాడు. సమీప బంధువు మరణించడంతో రెండు రోజుల క్రితం ఊరు వెళ్లామని, దుండగులు ఇంటి తాళం పగుల గొట్టి 320 గ్రాముల బంగారు, 310 గ్రాముల వెండి నగలు చోరీ చేశారని వాపోయాడు. సోమవారం ఈ మేరకు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రికెట్ అభిమాని మృతి బాధాకరం


జ్యోతికుమార్‌యాదవ్‌కు నివాళులర్పిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్స్‌లో ఇండియా ఓటమిని జీర్ణించుకోలేక క్రికెట్ అభిమాని జ్యోతికుమార్ యాదవ్ మృతి చెందడం పట్ల తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి రూరల్ మండలం, దుర్గసముద్రం గ్రామానికి చెందిన జ్యోతికుమార్ యాదవ్ నివాసం వద్దకు చేరుకున్న ఆయన జ్యోతి కుమార్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ మునిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మన్నికలో మేటి భారతి సిమెంట్

రాపూరు: నాణ్యత, మన్నికలో భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ మేటి అని ఆ సంస్థ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. భారతి సిమెంట్ ఆధ్వర్యంలో రాపూరులోని శివాని ఫర్టిలైజర్స్ కేంద్రంలో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే అత్యాధుని కటెక్నాలజీతో తయారవుతున్న భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతమవుతుందన్నారు. అతి తక్కువ సమయంలో సెట్టింగ్ పూర్తిచేయొచ్చని చెప్పారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష విలువ చేసే ప్రమాదబీమా సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. భారతి సిమెంట్ సంస్థ సేల్స్ ఆఫీసర్ మణికుమార్, డీలర్ పరంధామరెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.



తాపీ మేస్త్రీలకు బీమా పత్రాలను అందజేస్తున్న టెక్నికల్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి

ప్రేమా..ఇదినీకు న్యాయమా?

- రైలుకింద పడి ప్రేమికుల బలవన్మరణం


రాకేష్ (ఫైల్), పావని (ఫైల్)

గూడూరు రూరల్: విజయవాడలోని కోచింగ్ సెంటర్లో కుదిరిన స్నేహం విడదీయరాని బంధంగా ఏర్పడింది. అయితే పెద్దలు ఎక్కడ తమను కలుసుకోకుండా చేస్తారో అన్న భయం ఆ జంటను వెంటాడింది. గూడూరుకు సమీపంలో ఆదివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడేలా చేసింది. ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. గుంటూరు జిల్లా, శ్రీరుక్మిణిపురానికి చెందిన అన్నంగి పావని (19) హోటల్ మేనేజ్‌మెంట్ చేసింది. చిల్లకూరు మండలంలోని ఓ హోటల్‌లో పనిచేసేందుకు సొంత ఊరి నుంచి రెండు రోజుల క్రితం వచ్చింది. ఇక్కడ నుంచి తనకు గతంలో విజయవాడలోని కోచింగ్ సెంటర్‌లో చదుకుని ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా, సగిపాడు గ్రామానికి చెందిన దండే రాకేష్(23)ను గూడూరుకు రావాలని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. దీంతో ఆదివారం గూడూరుకు వచ్చి ఇద్దరూ కలుసుకున్నారు. అనంతరం ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ పెద్దలకు ఇష్టం లేకపోతే ఎవరికి వారు దూరం కావాల్సి వస్తుందని భావించారు. విడిపోయి ఉండలేక గూడూరు రైల్వే స్టేషన్ నుంచి సుమారు మూడు కీలో మీటర్ల దూరంలో ఉన్న గాంధీనగర్ ప్రాంతం వరకు ట్రాక్‌పై నడిచి వెళ్లి అక్కడ రైలు పట్టాలపై పడుకున్నారు. వారిపై నుంచి గూడ్స్ ట్రెన్ వెళ్లడంతో తలలు తెగి వారు అక్కడిక్కడే ప్రాణాలు విడిచారు. ప్రేమికులు పుట్టిన ఊరు నుంచి దూరంగా వచ్చి ఆత్మహత్య చేసుకోవడం గూడూరు డివిజన్‌లో సంచలనం సృషించింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు ఆసుపత్రి వద్ద రోదించిన తీరు పలువురిని కలచివేసింది.

కొడుకును హత్యచేసిన తండ్రి


మృతి చెందిన శ్రీధర్ రెడ్డి (ఫైల్)

కోట: మద్యం మత్తులో కన్న కుమారుడినే తండ్రి హత్య చేసిన సంఘటన ఆదివారం రాత్రి కోట మండలం, విద్యానగర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. విద్యానగర్ ప్రకాశం కాలనీ సమీపంలో పుచ్చలపల్లి కోటారెడ్డి కుటుంబం నివాసం ఉంటోంది. కోటారెడ్డి భార్య అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందింది. కుమారుడు శ్రీధర్‌రెడ్డి (24) తండ్రితో కలిసి ఉంటున్నాడు. అయితే తరచూ తండ్రీకొడులు గొడవలు పడేవారు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న కోటారెడ్డి డబ్బులు విషయమై కుమారుడితో గొడవ పడ్డాడు. విచక్షణ కోల్పోయి పక్కనే ఉన్న బండరాయితో కొడుకు శ్రీధర్‌రెడ్డి తలపై కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ హరికృష్ణ, ఎస్‌ఐ పుల్లారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడే ఉన్న కోటారెడ్డిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్సు-లారీ ఢీ


ప్రమాద స్థలంలో బస్సు, లారీ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం, తొండమనాడు ఆర్చి సమీపంలో సోమవారం లారీ, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం.. తిరుపతి నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు తొండమనాడు ఆర్చి సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఓ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చెన్నై ఈరోడ్డుకు చెందిన లారీ డ్రైవర్ కదిరి వేలు(45) కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. ప్రాథమికి చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. ఇదిలావుండగా ఈ ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమని తెలుస్తోంది.